
వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 332 సోమవారం | 22 జులై 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

## పంచ లోహ విగ్రహం బహూకరణ



గురుపౌర్ణమి సందర్భంగా ముడతనపెల్లి శ్యామ్ కూమార్-మాలతి దంపతులు ఎనిమిది కిలోల పంచలోహాల లక్ష్మీ గణపతి విగ్రహాన్ని ఓ సిటీ రోడ్డు, రాముల వారీ వీధిలోని శ్రీ సీతా రామాంజనేయ స్వామీ ఆలయంలో ఆలయ అధ్యక్షుడు కూచన ఏకాంబరం ఆధ్వర్యంలో అందజేశారు. అలాగే 24న సంకటహర చతుర్దశి పర్వదినం రోజున అన్నదానం చేయనున్నట్లు ప్రకటించారు. -వరంగల్ వాయిస్, కాశిబుగ్గ



వివరాలు 2లో..

# అప్పుడు రావులు ఇప్పుడు రెడ్లు

## పాలనంతా వారి చేతుల్లోనే

## ప్రభుత్వ కార్పొరేషన్లలోనూ సింహ భాగం వారిదే

## అడుగడుగునా బీసీలకు అన్యాయం

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొమ్మిదిన్నర సంవత్సరాలపాటు రావుల పాలన సాగితే నేడు రెడ్ల పాలన కొనసాగుతోంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముఖ్యమైన ప్రభుత్వ శాఖలన్నీ రావులకు కట్టబెట్టగా, నేడు సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ఉన్నత పదవులన్నీ వారి సామాజిక వర్గానికి చెందిన వారికే కేటాయిస్తున్నారు. పోస్టింగ్ కావాలంటే పేరు పక్కన 'రెడ్డి' ఉన్నదా అని చూస్తున్నారు. అనేక ప్రధాన శాఖల్లో ఈ కమ్యూనిటీ వాళ్లే తిష్ఠవేశారు. వివిధ రంగాల్లో బలపడిన ఆ సామాజిక వర్గం నేతలే వ్యవస్థలను శాసిస్తున్నారు. బదిలీల్లోనూ వారి ప్రభావం ఎక్కువైంది. మూడు దశాబ్దాల తర్వాత రాష్ట్రంలో రెడ్లకు అధికారం రావడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రతి రెడ్డి బిడ్డ తానే ముఖ్యమంత్రి, తానే మంత్రి, తానే ఎమ్మెల్యే అన్నట్లుగా ఫీల్ అవుతున్నారు. అటెండర్ నుంచి కలెక్టర్ వరకు, ఎమ్మెల్యే నుంచి సీఎం వరకు అన్ని విభాగాల్లో వారే ఉండడంతో ఇతర వర్గాలకు ప్రాధాన్యం తగ్గింది. రాష్ట్ర జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీల ఓట్లతో గద్దెనెక్కుతున్న నేతలు వారి సామాజిక వర్గానికే అన్ని రంగాల్లో పెద్ద పీట వేస్తున్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంక్ గానే చూస్తున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్



8లో..

## కౌన్సిల్ సమావేశం నిర్వహించండి

గ్రీవెన్స్ లో కార్పొరేటర్ల వినతి | ప్రజా సమస్యలపై పట్టింపులేదా అంటూ నిలదీత



2లో..

## మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రావీణ్య





# అప్పుడు రావులు ఇప్పుడు రెడ్లు



**పాలనంతా వారి చేతుల్లోనే**
**ప్రభుత్వ కార్పొరేషన్లలోనూ సింహ భాగం వారిదే**
**అడుగడుగునా బీసీలకు అన్యాయం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో రెడ్ల పాలన సాగుతోంది. రాజకీయాలు, అధికారులనే భేదం లేకుండా అన్ని విభాగాల్లో వారికే అధిక ప్రాధాన్యం దక్కుతోంది. అన్ని కీలక శాఖల్లో ఇప్పటికే వారు తిష్ఠ వేశారు. పేరు పక్కన 'రెడ్డి' ఉంటే చాలు పలిచి పెద్దపీట వేస్తున్నారు. అటెండర్ నుంచి కలెక్టర్ వరకు, ఎమ్మెల్యే నుంచి ముఖ్యమంత్రి వరకు అన్ని విభాగాల్లో వారే ఉన్నారు. అన్ని రంగాల్లో బలపడినందున వారు వ్యవస్థలను సైతం శాసిస్తున్నారు.

### ఉమ్మడి వరంగల్ జిల్లాలో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయంగా ఒక్క బీసి బిడ్డకు కూడా అవకాశం లభించకపోవడం శోచనీయం. శాసన సభ రిజర్వేషన్ స్థానాలను మినహా ఇస్తే మిగిలిన అన్న నియోజకవర్గాల్లో ఉన్నత వర్గాలకు చెందిన వారే పాగా వేశారు. అదే విధంగా ఇటీవల ప్రకటించిన వివిధ కార్పొరేషన్లకు కుడా రెడ్డి సామామాజిక వర్గానికి చెందిన వారిదే సింహ భాగం దక్కిందని చెప్పుకోవచ్చు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎం సూపరింటెండెంట్ ఇటీవల బదిలీకాగా ఆ స్థానాన్ని కూడా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికే కట్టబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.

### బీసీలకు అన్యాయం..

రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీలకు అడుగడుగునా అన్యాయమే జరుగుతోంది. బీసీ ఓట్లతో గద్దెనెక్కుతున్న వారు వారి సామాజిక వర్గానికి చెందిన వారికే పెద్ద పీట వేయడంతో బీసీలకు తీరని అన్యాయం జరుగుతోంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిదిన్నర సంవత్సరాలపాటు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ అన్ని విభాగాల్లో రావులకు పెద్ద పీట వేసి తన సామాజిక వర్గానికి అత్యున్నత స్థానం కల్పించారు. తర్వాత తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి తన వర్గానికే అత్యున్నత పదవులు కట్టబెట్టడంతో బీసీలకు తీరని అన్యాయం జరుగుతోంది. దీంతో బీసీ కులాలన్నీ కోపంతో రగిలిపోతున్నాయి. ఓట్లు మావి..పదవులు మీవా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీసీలు శాసన సభకు, పార్లమెంట్ కు పోవద్దా అంటూ ప్రశ్నిస్తున్నారు. రెడ్లు మాత్రమే అర్హులా అంటూ నిలదీస్తున్నారు. కేసీఆర్ తన కుటుంబ సభ్యులకు అధికారం కట్టబెడితే రేవంత్ రెడ్డి మాత్రం రెడ్డి కులానికి పెద్ద పీట వేస్తున్నారని మండిపడుతున్నారు. ఇదే ఒరవడి కొనసాగితే తిరుగుబాటు తప్పదని హెచ్చరిస్తున్నారు. బీసీలంతా ఐక్యత చాటాల్సిన తరుణం ఆసన్నమైందని ప్రకటిస్తున్నారు. బీసీలు రాజకీయంగా ఎదిగేందుకు కావాల్సిన అన్ని హంగులను సిద్ధం చేసుకుంటున్నారు. రానున్న రోజుల్లో బలమైన శక్తిగా బీసీలు నిలువనున్నారు.



# అధికారులు అప్రమత్తంగా ఉండండి

**నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నాయిని**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగర మేయర్ గుండు సుధారాణి సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి మేయర్ క్షేత్రస్థాయిలో పర్యటించి వరదలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అధికారులకు సిద్ధంగా ఉండాలంటూ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా 12 మోరీలు, పోతన నగర్, విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంతాల్లో గల నాలాలు, భద్రకాళి ఆలయంకు వెళ్ళే నాలా ప్రవాహ తీరు, కాపు వాడ వైపు గల భద్రకాళి మత్తడి, పెద్దమ్మ గడ్డ నాలా, చిన్న వడ్డేపల్లి చెరువు ప్రాంతాలలో నీటి నిల్వ స్థితి గతులను, నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు ప్రవీణ్ చంద్ర, కృష్ణా రావు, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సిటీ ప్లానర్ వెంకన్న, డీఎఫ్ఓ శంకర్ లింగం, ఈఈలు రాజయ్య, శ్రీనివాస్ డీఈలు రవికుమార్, రవికిరణ్, రంగారావు, ఏఈలు హరికుమార్, కార్తీక్, సతీష్, శానిటరీ ఇన్ స్పెక్టర్ సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేతో కలిసి..

వరంగల్ పశ్చిమ శానసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డితో కలసి నగర మేయర్ గుండు సుధారాణి నగరంలోని 4వ డివిజన్ లోని లోటస్ కాలనీ, అక్షర కాలనీ, జ్యోతిబాసు నగర్ కాలనీ నాల సమస్యను పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుడా చూసుకోవాలని మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు.

# మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

**అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రావీణ్య**



**వరంగల్ వాయిస్, నడికుడ :** వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులను త్వరతిగతిన పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. నడికుడ మండలం కంఠాత్మకూర్ గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న రోడ్డు, అదేవిధంగా పరకాల శివారులో ఉన్న చలివాగు వంతెనను ఆమె సోమవారం పరిశీలించారు. కంఠాత్మకూర్ వాగు నుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో దెబ్బతిన్న కాజ్ వే ను కలెక్టర్ సందర్శించి అక్కడ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన వివరాలను ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పరకాల శివారులోని చలివాగు వంతెన వర్షాల కారణంగా దెబ్బతినగా కలెక్టర్ పరిశీలించి మరమ్మతు పనులు చేపడుతున్న జాతీయ రహదారుల శాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. సాయంత్రంలోగా పనులు పూర్తిచేయాలని ఎన్.హెచ్ డీఈ కిరణ్, అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పురపాలక, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ ఎప్పటికప్పుడు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించిచారు. కలెక్టర్ వెంట పరకాల ఆర్డీవో డాక్టర్ కె.నారాయణ, నడికుడ, పరకాల తహసిల్దార్లు నాగరాజు, భాస్కర్, పరకాల పురపాలక కమిషనర్ నరసింహ, ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్ అండ్ బి డీఈ ఎండి గౌస్, ఇరిగేషన్ శాఖ డీఈ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# మచ్చర్లయ గుట్టను.. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

**దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి**

**వరంగల్ వాయిస్, శాయంపేట :** శాయంపేట శివారులోని మచ్చర్లయ గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా శాయంపేట మచ్చర్లయ గుట్టపై జలపాతాలు ఏర్పడ్డాయని శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయం పక్కనే ఉన్న జల ధారలు కనువిందు చేస్తున్నాయని వివరించారు. వీటిని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారన్నారు. గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో అందమైన జలపాతాలు ఏర్పడ్డాయని అన్నారు. ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దితే ప్రకృతి అందాలను తిలకించడంతోపాటు శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయాని వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఈ విషయంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని సామల భిక్షపతి కోరారు.

## మూవీ యాక్టర్ సంజోష్ చేయూత



**వరంగల్ వాయిస్, ఏటూరు నాగారం :** గుత్తి కోయ గుంపుకు భోజనాలతో పాటు నిత్యావసర సరుకులు అందజేసిన మూవీ యాక్టర్ హీరో సంజోష్ ఇప్పటికే ముగ్గురు ప్రతిభ గల పేద చిన్నారులను చదివిస్తూ తన సేవాగుణాన్ని చాటుకుంటున్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని ఒక మారుమూల గ్రామం శంకర్ రాజపల్లిలో సంజోష్ జన్మించి, పదవ తరగతి వరకు ములుగులోని వివేకవర్ధిని పాఠశాలలో చదువుకొని పై చదువులన్నీ హైదరాబాద్ లో పూర్తిచేసుకున్నారు. తనలో దాగి ఉన్న టాలెంట్ ని నిరూపించుకోవడానికి సినీ ఇండస్ట్రీ వైపుగా వెళ్లి హీరోగా బేవర్స్ మూవీతో తెరంగ్రేటం చేసి మంచి గుర్తింపు పొందారు. ఇప్పుడు రిలీజ్ కు సిద్ధంగా ఉన్న సోదర సినిమా హీరో మన లోకల్ టాలెంటెడ్ యాక్టర్ సంజోష్ వరస సినిమాలతో దూసుకుపోతున్నారు. తను మంచి హీరోనే కాదని, మంచి సేవా గుణం కూడా తనలో ఉందని చాటుతున్నారు. తను పుట్టిన ములుగు జిల్లాకు ఏదో విధంగా సహాయం చేయాలనే దృక్పథంతో ఆదివారం ఏటూరునాగారం మండలం చినబోయినపల్లి గ్రామ పంచాయతీలోని చింతల మోరి అనే గొత్తికోయ గుంపుకు దాదాపు 2 వందల మందికి భోజనాలు పెట్టడమే గాక ఒక 30 కుటుంబాలకు 5 కేజీల బియ్యం ఒక టార్చ్, రెండు దోమతెరలు, ఒక బెడ్ షీట్, టవల్,ప్లేటు, గ్లాసు అందించారు. మీకు ఎలాంటి అవసరం వచ్చినా నేను ఉన్నానని భరోసానిచ్చారు. వారితో కలిసి భోజనం చేసి కొద్దిసేపు సరదాగా గడిపారు. చివరగా ఆ గ్రామ ప్రజలు ఒక వాటర్ ప్యూరిఫైయర్ కావాలని గొత్తికోయలు కోరడంతో వారికి కొద్ది రోజుల్లో పంపిస్తానని మాటిచ్చారు.

## బాలుడికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం(టీపీయూఎస్) బ్రెయిన్ స్ట్రోక్ తో బాధపడుతున్న బాలుడికి ఆర్థిక సాయం అందించి దాతృత్వాన్ని చాటుకుంది. వరంగల్ శివనగర్ కు చెందిన మడత ప్రవీణ్ దంపతుల ఏడు సంవత్సరాల చిన్నారి యతిన్ తేజ్ అనే బాలుడు బ్రెయిన్ స్ట్రోక్ తో అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. ఈ చికిత్సకు భారీ మొత్తం ఖర్చవుతుందని, వారు నిస్సహాయ స్థితిలో ఉన్న స్థితిని గమనించి తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, కార్యదర్శి తీరందాస్ యాదగిరి, సలహాలు సూచనలతో జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ జిల్లాల తపస్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కోడెం రవి ప్రకాష్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పిట్ట ఉమాదేవి, కార్యవర్గ సభ్యులు డాక్టర్ మోత్కూరి ప్రశాంత్ సహృదయులైన ఆయా జిల్లాల పద్మశాలి ఉద్యోగుల సంఘం సభ్యుల నుంచి విరాళాలు సేకరించారు. అలా సేకరించిన 1.70 లక్షలను (1,70,000) వారికి అందజేసి, బాలుడి ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మహత్తర కార్యక్రమానికి విరాళాలు ఇచ్చిన పద్మశాలి ఉద్యోగ కుల బాంధవులందరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇలాంటి కార్యక్రమాలను మునుముందు కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. సహకరించిన అందరికీ తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ధన్యవాదాలు తెలియజేశారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం




**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో ఒకటో వార్డు సీఎస్ఐ కాలనీ, జిలారీ వాడ, పిలుకం గల్లీలలో కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ శానిటేషన్ పనులు చేయించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించి డ్రైనేజీల ద్వారా నీళ్లు మళ్లించి రోడ్ల వెంట డ్రైనేజీల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, వార్డులో పర్యటిస్తూ, ప్రజలతో మాట్లాడుతూ సమస్యలను తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని కోరారు. స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త సేకరణ చేయాలని, దోమల మందు ఫాగింగ్ చేయించాలని, బ్లీచింగ్ చల్లించాలని, పట్టణ, వార్డు ప్రజల యోగక్షేమాలే ముఖ్యమని చైర్ పర్సన్ కు, కమిషనర్ కు కౌన్సిలర్ విజ్ఞప్తి చేశారు.

# నాగవంశీ గడ్డం అద్భుత యాత్ర

### 6700 కి.మీల బైక్ రైడ్

**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని రాయపర్తి గ్రామానికి చెందిన, ప్రస్తుతం ముంబైలో నివసిస్తున్న నాగవంశీ గడ్డం ఒక ఉత్సాహవంతమైన బైకర్. మహత్తరమైన పర్యావరణమైన లడాఖ్, స్పిటీ వ్యాలీలో బైక్ రైడ్ చేయాలని తన కల. 2024లో ఈ కల సాకారమైంది. తన యమహా ఎంటీ 15పై 30 రోజుల యాత్రలో 6700 కిలోమీటర్లకు పైగా నాగవంశీ గడ్డం ప్రయాణించారు. ఈ అద్భుత యాత్ర కేవలం కిలోమీటర్లను కవర్ చేయడమే కాదు, భారతదేశంలోని విభిన్న సంస్కృతి, ఆధ్యాత్మికత, ప్రకృతి అందాలను అనుభవించడం జరిగింది. ప్రతి రోజు ఒక కొత్త అధ్యాయంగా నిలిచిందని,సవాళ్లతో, ఆశ్చర్యకరంగా మర్చిపోలేని జ్ఞాపకాలతో నిండిందని బైకర్ నాగవంశీ గడ్డం తెలిపారు.









## బీరన్న ఉత్సవాల కానుకల లెక్కింపు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తొలి ఏకాదశి మహా పర్వదినం ఉర్సు శ్రీ బీరన్న స్వామి ఉత్సవాల సందర్భంగా భక్తులు వేసిన కానుకలను దేవాలయ చైర్మన్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో లెక్కించారు. భక్తులు హుండీలో వేసిన డబ్బులను లెక్కించగా రూ.25,470 వచ్చాయి. శ్రీ బీరన్న స్వామి ఉత్సవాల సందర్భంగా మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో దేవాలయ ప్రాంగణంలో విద్యుత్ అలంకరణ, శానిటేషన్ పనులు చేపట్టడం, రోడ్లు దిగుడు ఉన్న చోట్ల మొరం చల్లించుట పనులు చేయించినందుకు, శాంతి భద్రతలను పరిరక్షించి పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించినందుకు, నిరంతరం నాణ్యమైన కరెంటును సరఫరా చేసినందుకు మహానగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, నగర ఏసీపీ నందిరాం నాయక్, మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ సీఐ మల్లయ్య, కరీమాబాద్ ఎలక్ట్రికల్ ఏఈఈ అశ్విని కుమార్ లకు ధర్మకర్తల మండల చైర్మన్ మరుపల్ల రవి కృతజ్ఞతలు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ధర్మకర్తలు ఏర కోటేశ్వర్, నీల యాకయ్య, మండల ప్రమీల, కోరే ఐలయ్య, గౌడ కోటేశ్వర్, పూజారి బలబద్ర భాస్కర్ లు ఉన్నారు.

## దాశరథి స్ఫూర్తితో ముందుకెళ్లాలి



**వరంగల్ వాయిస్ మహబూబాబాద్ :** కంకరబోడ్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి రామారావు సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ పాఠశాలను పరిశీలించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు నేటి నుంచి మారిన పాఠశాల పనివేళల గురించి వివరించి, తగు సూచనలు చేశారు. నేడు దాశరథి కృష్ణమాచార్యుల జయంతిని పురస్కరించుకొని వారిని స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలని సూచించారు. తెలుగు టీచర్‌తో దాశరథి గురించి చెప్పించడంతో పాటు జిల్లా విద్యా శాఖ అధికారి కూడా దాశరథి గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. నా తెలంగాణ కోటి రత్నాల వీణ అని దాశరథి ఎలుగెత్తి చాటారని కొనియాడారు. ఆలస్యంగా వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు రేపటి నుంచి సమయానికి వచ్చేలా చూడాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులను తెలిపారు. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు, ఎంఎన్ఓలు వారి పరిధిలోని పాఠశాలలకు తగు సూచనలు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాలోత్ కోట్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అడుగు తీసి అడుగు వేసేదెలా?

### అధ్వానంగా అంతర్గత రోడ్లు

### బురదమయంగా తండాల రహదారులు

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** కాలు పెట్టేందుకు ఖాళీగా లేదు.. నాటు వేసే బురద పొలానికి ఏం తక్కువ కాదన్నట్లు తండాల్లోని అంతర్గత రోడ్డు అధ్వానంగా తయారయ్యాయి. ప్రజలు అడుగు తీసి అడుగు వేయాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై నీరు నిలిచి కుంటలను తలపిస్తోంది. గుంత లోతు తెలియక జారీ పడితే ఇక అంతే సంగతి అన్నట్లుగా ఉంది పరిస్థితి ఈ రోడ్డు పై ప్రయాణం. పర్వతగిరి మండలంలోని ఇస్లావత్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మూడు తండాలో అంతర్గత రోడ్డు బురదమయంగా మారి నడవలేని స్థితిలో ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో కూడా తండాల్లోని అంతర్గత రోడ్లు బురదమయంగా మారి ఇబ్బందులు పడ్డామని స్థానిక ప్రజా ప్రతినిధులకు విన్నవించినా కనీసం తట్టెడు మట్టి పోయలేదని దుయ్యబట్టారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో గత మూడు రోజులుగా ముసురేసిన వానతో అంతర్గత రోడ్లు చిత్తడిగా మారి నానా అవస్థలు పడుతున్నామని తండా



వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వర్షపు నీరు నిలిచి పొలాన్ని తలపిస్తుంది. దీంతో ఎవరైనా అటు వైపు వెళ్తే భారీ గుంతలో పడి ప్రాణాల మీదకు తెచ్చుకునే ప్రమాదం ఉంది. మరో రెండు, మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో బురద రోడ్డుపై తాము ఎలా వెళ్లేది అంటూ గిరిజనులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా తమ సమస్యలు తీరుతాయని గిరిజనులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పందించి తమ సమస్యలపై ప్రతేక దృష్టి సారించాలని, గిరిజన గ్రామాల్లోని అంతర్గత రోడ్లను సీసీ రోడ్డుగా నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# మిర్చి పంట సాగుపై రైతులకు అవగాహన




**వరంగల్ వాయిస్, మొగుళ్లపల్లి :** మండలంలోని రంగాపురం గ్రామంలో కృషి విజ్ఞాన్ కేంద్రం మామునూరు, కృషి జాగరణ సంస్థలు సంయుక్తంగా రైతులకు మిర్చి పంట పెంపకంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్రం మామునూరు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న, భూపాలపల్లి వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్, జిల్లా హార్టికల్చర్ అధికారి సంజీవరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి వారు మాట్లాడారు. రైతులు దిగుబడి పైన కాకుండా నాణ్యత ప్రమాణాల పైన కూడా అవగాహన కలిగి ఉండాలని, వీటికోసం సోలార్ డ్రైర్స్ వాడి ఎండబెట్టాలని, దీనివలన ఇతర దేశాలకు కూడా మిర్చి పంటను ఎగుమతి చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా రైతులందరూ సామూహిక సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలన్నారు. అలాగే కలుపు మొక్కలు లేకుండా చూడాలన్నారు. రైతులు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ను ఏర్పాటు చేసుకొని మిర్చి పంట నుండి లాభాలు పొందాలని సూచించారు. భూపాలపల్లి ప్రాంతంలో మిరప పంటను ప్రతి సంవత్సరం ఒకే ఏరియాలో ఎక్కువగా పండిస్తున్నారని, దీనివలన ఎండు తెగులు ఎక్కువగా వస్తుందన్నారు. పంట మార్పిడి కచ్చితంగా చేయాలని సూచనలు చేశారు. తామర పురుగుల నివారణకు విచక్షణ రహితంగా పురుగుమందులు వాడుతున్నారన్నారు. అలాగే ప్రతి సంవత్సరం లక్షాధికారి రైతును గుర్తించి కృషి జాగరణ సంస్థ నుంచి సత్కరిస్తామని రీజనల్ మేనేజర్ మహంతి తెలిపారు. అనంతరం డాక్టర్ రాజు, డాక్టర్ సౌమ్యలు మిరప పెంచుకునే విధానం పైన చీడపీడలపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇద్దరు ఉత్తమ రైతులు జనార్దన్ రావు, దేవేందర్ రెడ్డిలను శాలువా కప్పి ఉత్తమ అవార్డులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రెండు లక్షల కోట్లు కేటాయించాలి

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్ లో బీసీలకు రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2023-24 గత సంవత్సరం 45 లక్షల కేంద్ర బడ్జెట్లో 70 కోట్లకు పైగా ఉన్న బీసీలకు కేవలం 2000 కోట్లు మాత్రమే కేటాయించి తీరని అన్యాయం చేశారన్నారు. మోడీ ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి బీసీల ఎడల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు వంచనకు గురి చేస్తున్నారన్నారు. అందుకే మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించాల్సి వచ్చిందన్నారు. ఇకనైనా బీసీ వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలన్నారు. దేశవ్యాప్తంగా బీసీల న్యాయమైన డిమాండ్ల సాధనకై అనేకఉద్యమాలుజరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం గర్హనీయమన్నారు. ఉద్యమాలు ఉధృతం కాకముందే తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం నిర్వహించ బోయే జన గణనలో బీసీల కులగణన చేపట్టి బీసీల జనాభా ఎంతో కచ్చితంగా తేల్చాలన్నారు. సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా విద్య వైద్య రంగాలన్నింటిలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని, దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల సంక్షేమానికి అభివృద్ధికి తగిన విధంగా నిధులు కేటాయించి ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యా ,ఉద్యోగ రిజర్వేషన్లను 27 శాతం నుంచి 56 శాతం పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, చట్ట సభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టాన్ని ప్రవేశపెట్టి ఆమోదింపచేయాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, ఫిక్స్ వేతనం నెలకు రూ.18 వేలు ఇవ్వాలని ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆశా వర్కర్లు గిరిజన ప్రాంతంలో గత 33 సంవత్సరాల నుంచి మైదాన ప్రాంతంలో జిల్లాలో 13 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారు. కరోనా కాలంలో భయపడకుండా నియంత్రించడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషించారన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశ వర్కర్లకు అవార్డు కూడా ప్రకటించిందని తెలిపారు. అన్ని పనులు నిర్వహిస్తున్న ఇంతటి సీనియార్టీ సేవలందిస్తున్న ఆశా వర్కర్ల ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. ఆశా వర్కర్లకు కనీస పని భద్రత కరువైందని, పట్టించుకునే పరిస్థితి లేదని రాష్ట్రవ్యాప్తంగా ఆశలు పెద్ద ఎత్తున ధర్నాలు, పోరాటాలు చేసిన ఫలితం కానరావడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీహెచ్ రాణి, వజ్ర ఉషారాణి, సుజాత, మాధవి లత, రమ, పద్మ, మాధవి, రమాదేవి, మరియా, రజిత, ఆయుష, రాజేశ్వరి, కారుణ్య, స్వప్న, రమా తదితరులు పాల్గొన్నారు.

## ఆడెపు శ్రీహరి సిద్ధాంతికి సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రామన్నపేటలోని డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హంటర్ రోడ్ శాయంపేట ప్రాంతంలో నివాసముంటున్న బ్రహ్మశ్రీ ఆడెపు శ్రీహరి సిద్ధాంతి, పంచాంగ కర్తను సోమవారం ట్రస్ట్ చే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్ట్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ శ్రీహరి సిద్ధాంతి గత 70 సంవత్సరాల నుంచి పౌరోహిత్యం, జ్యోతిష్యం చెబుతూ గత 50 సంవత్సరాల నుంచి పంచాంగ కర్తగా కొనసాగుతున్నారు. వీరు కేవలం వరంగల్ లోనే కాక తెలంగాణ, ఇతర రాష్ట్రాలు మహారాష్ట్ర, సోలాపూర్ ఇతర రాష్ట్రాల్లోఅక్కడ పద్మ బ్రాహ్మణులు ఇతరులు ఘనంగా సన్మానిస్తూ ప్రశంసా పత్రాలు ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా తన వివాహ కార్యక్రమం కూడా ఈయన ఆధ్వర్యంలో జరిగిందని రాజేంద్రప్రసాద్ గుర్తుచేసుకున్నారు. ఇప్పటికి ప్రజలకు అందుబాటులో ఉంటూ పద్మ బ్రాహ్మణులకుతగు సూచనలు ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ శ్రవణ్, బ్రహ్మశ్రీ మల్లిపెద్ది కృష్ణశాస్త్రి, చంద్రమౌళి, మహేందర్, ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బీజేపీ మహిళా మోర్చా 34వ డివిజన్ అధ్యక్షురాలిగా జారతి దేవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తూర్పు నియోజకవర్గం లోని 34వ డివిజన్ కి చెందిన జారతి దేవిని వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్, వరంగల్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బండారి కళ్యాణి ఆదేశాల మేరకు 34వ డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా నియమించినట్లు బీజేపీ 34వ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ తెలిపారు. పార్టీ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటునందుకు గాను, జిల్లా కమిటీ గుర్తించి డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా నియమించిందని తెలిపారు. అనంతరం 34వ డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు జారతి దేవి మాట్లాడుతూ పార్టీ పటిష్టతల కోసం పనిచేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ కు, వరంగల్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బండారి కళ్యాణికి, 34వ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీకి కృతజ్ఞతలు తెలిపారు.

## బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా బీసీ డిక్లరేషన్ ను వెంటనే అమలు చేయాలని కోరుతూ సోమవారం బీజేపీ నడికూడ మండల అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు బానాల శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో బీసీల హక్కుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో బీసీలకు ఇచ్చిన, 21 హామీలను వెంటనే అమలు చేయాలని, నడికూడ తహసిల్దార్ జి నాగరాజు కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీల అభివృద్ధి కోసం కామారెడ్డి సభలో చేసిన డిక్లరేషన్ కు అనుగుణంగా రాష్ట్రంలో జనాభా ప్రాతిపదిక బీసీ రిజర్వేషన్ల పెంపు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ,ప్రతి జిల్లా కేంద్రంలో 50 కోట్లతో బీసీ భవన్, ప్రతి మండలానికి బీసీ గురుకులం ఏర్పాటు, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు ,ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే సబ్ ప్లాన్ ఏర్పాటు, బీసీల అభివృద్ధి కోసం తొలి సంవత్సరం 20 వేల కోట్లతో అన్ని కులాలకు కార్పొరేషన్లు, అర్హులైన బీసీలకు 10 లక్షల సహాయం తదితర హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు బాణాల శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు గోగుల రాజి రెడ్డి, నాయకులు మూల తిరుపతిరెడ్డి, మోత్కూరి శంకరయ్య, ప్రవీణ్, గోనెల కోటి, అల్లం వజ్రం, అల్లే రఘుపతి, మొర్రి మొగిలి, ఆకునూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



**వరంగల్ వాయిస్, ఖిలావరంగల్ :** "శ్రీ వాసవి విద్యా సేవాసమితి" వారి ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ మధ్య కోటలోని ఆర్యబాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు 300 నోట్ పుస్తకాలను సోమవారం మధ్యాహ్నం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి విద్యా సేవా సమితి అధ్యక్షుడు శ్రీరాం భిక్షపతి మాట్లాడుతూ ఈ పాఠశాలలోని విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. సేవా సమితి కార్యదర్శి గుముడవెల్లి సత్యనారాయణ రావు మాట్లాడుతూ తాము ఇచ్చిన నోటు పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ రవి, ఉపాధ్యాయులు టి.నరేందర్, సునీత, మనోజ్, ఉషారాణి, సమితి కోశాధికారి ఎస్.సతీష్, సభ్యులు దివ్వెల పూర్ణచందర్, పి.వీరన్న, డి.అరవింద్, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## 'రీల్స్' ఒక మానసిక రుగ్మత

### సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఒక పని సరదాగా చేస్తే పర్వాలేదు కానీ, అదే వ్యాపకంగా, వ్యసనంగా మారితే అనేక చెడు ప్రభావాలకు దారితీస్తుందని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. ఇటీవల కాలంలో పది సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల వయసు వారు కూడా "రీల్స్" వ్యామోహంలో పడి విలువైన వారి ప్రాణాలను పోగొట్టుకుంటున్న సంఘటనలు తనను తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నాయని అన్నారు. వారిని కన్న వారికి, వారిపై ఆధారపడిన వారికి శోకాన్ని మిగులుస్తున్నారని, ముఖ్యంగా యువతలో సరదాగా ప్రారంభమై తర్వాత కొందరిలో తీవ్ర వ్యసనంగా మారి ప్రాణాల మీదికి తెస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్యకాలంలో ఇవి శృతి మించి రైళ్లకు ఎదురు వెళ్లడం, వేగంగా వస్తున్న బస్సుల ముందుకు అకస్మాత్తుగా రావటం వాటికి ఎదురుగా పడుకోవటం లాంటి పిచ్చి పనులు, బైకుల మీద విచిత్ర విన్యాసాలు చేస్తూ యాక్సిడెంట్లకు గురికావడం, లోయలలో నదులలో సాహసాలు అనుకొని వారు చేసే ఈ పనుల వల్ల ప్రాణాలు పోయిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. రెండు రోజుల క్రితం పది సంవత్సరాల బాలుడు ఉరి వేసుకోవటం అంటూ స్నేహితులతో కలసి"రీల్" చేస్తూ ఆ తాడు మెడకు పొరపాటున బిగించుకొని మరణించడం తనను తీవ్రంగా కలిసి వేసిందన్నారు. "రీల్స్' వ్యామోహంలో పడిన వారిని గుర్తించి ప్రోత్సహించకుండా వారి తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు కనిపెట్టిమానసిక నిపుణుల సలహా తీసుకోవాలని ఆయన అన్నారు. ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా ఉండాలని ఆయన ఆశించారు.

## మర్కజిలో దాశరథి జయంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాలలో దాశరథి జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీ రామారావు దాశరథి చిత్రపటానికి పూలమాల వేశారు. ఉపాధ్యాయులు పూలతో అంజలి ఘటించారు. తర్వాత పిల్లలకు దాశరథి గురించిన పలు విషయాలను ఉపాధ్యాయులు వివరించారు. గణిత ఉపాధ్యాయులు కంది శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దాశరథి తెలంగాణ గర్వించదగ్గ కవి అన్నారు. అనేక సాహిత్య విలువలు గల పాటలను ఆయన రాశాడన్నారు. తెలుగు భాషోపాధ్యాయుడు వలస పైడి మాట్లాడుతూ దాశరథి ధైర్యవంతుడైన కవి అని, గొప్ప సైన్యం కలిగిన నిజాం రాజును తన పద్యాలతో ధిక్కరించాడన్నాడు. "నా గీతావళి ఎంత దూరంబు ప్రయాణంబౌనో అంతదాకా ఈ భూగోళంబునకు అగ్గిపెట్టెద "అంటూ దాశరథి తన పద్యాలతో ప్రతి మనిషిని ఒక అగ్ని కణంగా మార్చాడని, తెలంగాణము రైతుదే అంటూ రైతు గొప్పతనాన్ని కీర్తించిన దాశరథి మనకు చిరస్మరణీయుడు అన్నారు. మరో భాషోపాధ్యాయుడు భూక్య బాలు దాశరథి చిత్రపటానికి అంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ కే.వాసు, ఈ. శ్రీనివాస్, పద్మావతి, నర్సయ్య, సమ్మి రెడ్డి, రాజిరెడ్డి, మనోహర్, సరిత, విద్యా సాగర్, స్వామి, లలిత, రమాదేవి తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆహార పొట్లాల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలో ఎడ తెరిపిలేని ముసురు వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయంమయ్యాయి. జీడబ్ల్యూఎంసీ 43వ డివిజన్ పరిధిలోని రాంగోపాలపురం, మార్కండేయ నగర్ లో ఇళ్లు నీట మునిగాయి. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ కేఆర్ నాగరాజు స్థానిక కాంగ్రెస్ నాయకులను సత్వరం సాయం అందించాల్సిందిగా స్థానిక కాంగ్రెస్ నాయకులను పురమాయించారు. వెంటనే కార్పొరేటర్ ఈదురు అరుణా విక్టర్ ఆధ్వర్యంలో సోమవారం లోతట్టు ప్రాంతాలను సందర్శించి వరద బాధితుల సమస్యలు తెలుసుకుని ఓదార్పునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు దోమ సతీష్, మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో కార్పొరేటర్ ఆహార పొట్లాలు, తాగునీటి పాకెట్లను బాధితులకు పంపిణీ చేశారు. నీరు నిలువకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు ప్రభలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విష కీటకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాడుగుల నర్సింగం, అనకట్ల వినయ్, అక్బర్, దోమ సాయిరెడ్డి, యాడాల సాంబరావు, విజయలక్ష్మి, మున్సిపల్ జవాన్లు క్రిష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మేరుగు లక్ష్మికి డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీలోని జువాలజీ విభాగం పరిశోధకురాలు మేరుగు లక్ష్మికి కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. "సీజనల్ అబండన్స్ ఆఫ్ సాయిల్ ఇన్హబిటింగ్ ఆర్థోపోడ్స్ ఇన్ ఫారెస్ట్ అండ్ ఆగ్రో ఎకోసిస్టం ఇన్ వరంగల్ డిస్టిక్" అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి మేరుగు లక్ష్మికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ చారి ఒక ప్రకటనలో తెలిపారు. జువాలజీ విభాగం ప్రొఫెసర్ ఈసం నారాయణ పర్యవేక్షణలో లక్ష్మి తన పీహెచ్ డీ పూర్తి చేశారు. నర్సంపేటకు చెందిన లక్ష్మి గతంలో రెండు అంతర్జాతీయ, మరో రెండు జాతీయ స్థాయి సెమినార్లలో పాల్గొన్నారు. 2017 జాతీయ స్థాయిలో కాకతీయ విశ్వవిద్యాలయం జువాలజీ విభాగంలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సెమినార్ లో ఉత్తమ పోస్టర్ ప్రెజెంటేషన్‌తో అవార్డు గ్రహీతగా నిలిచింది.

## రసాయన రహిత సాగుకు శిక్షణ




**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని వరికోలు గ్రామం రైతువేదికలో సోమవారం గ్రామ రైతులకు మిర్చి పంటలో రసాయన రహిత సాగు పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. పోతన ఎడ్యుకేషనల్ సొసైటీ(ఎన్జీవో) ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ పీ సంస్థ కేరళ ద్వారా హసన్ పర్తి ఎఫ్ పీవో మిరప పంట సాగు పద్ధతులను రైతులకు శిక్షకులకు ఎన్ఎస్ఎస్ పీ మాస్టర్ ట్రైనర్ కె.ఉపేందర్ రెడ్డి, ఐపీఎం పద్ధతులు సేంద్రియ సాగు విధానం, పంట కోతల విధానం, మార్కెటింగ్ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. శిక్షకులకు తోడుగా ఆసక్తి గల రైతులు దాదాపు 70 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పోతన ఎన్జీవో సీఈఓ జి.వెంకట్ రెడ్డి, నడికూడ ఎఫ్ పీవో డైరెక్టర్ నారగని రమేష్, పోతన ఎన్జీఓ ఎఫ్ పీవో కోఆర్డినేటర్ బియ్యాల ప్రశాంత్, వరికోలు ఏఈఓ కల్యాణి, రైతులు పాల్గొన్నారు.

# ఆశించే స్థాయి నుంచి.. శాసించే స్థాయికి బీసీలు ఎదగాలి

### జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయండి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీసీలు ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలనే సంకల్పంతో దేశమంతా బీసీ ఉద్యమాన్ని విస్తరించి, ఢిల్లీ కోటపై బహుజన జెండాను ఎగురవేసేందుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో ఉద్యమాలు కొనసాగుతున్నాయని, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. ఆగస్టు 7న పంజాబ్ లోని అమృత్ సర్ లో జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ 9వ మహాసభ వాల్ పోస్టర్ ను సోమవారం హనుమకొండ లోని బాలసముద్రంలో గల ప్రెస్ క్లబ్ లో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ మన చెమట చుక్కల ద్వారా, మన నెత్తుటిని చిందించి దేశ సంపదను సృష్టించే మనం అన్ని రంగాల్లో వెనుకబడడానికి కారణం చట్టసభల్లో రిజర్వేషన్లు లేకపోవడమేనన్నారు. దేశ జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న మనం, విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో ప్రాతినిధ్యం లేకపోవడంతో మనం అడుక్కునే స్థాయికి దిగజారితే, అర శాతం ఉన్న అగ్రవర్ణాలు అధికారం అనుభవిస్తూ, అన్ని రంగాలను వారి గుప్పిట్లో పెట్టుకున్నారన్నారు. బీసీ అంటే బ్యాక్వర్డ్ క్లాస్ అని మనలను ఎప్పటికీ వెనకకు నెట్టివేస్తున్నారని, బీసీ అంటే ఒక బిగ్గెస్ట్ క్యాస్ట్ అని, బ్రిలియంట్ క్యాస్ట్ అని, బెస్ట్ క్యాస్ట్ అని ప్రపంచానికి చాటిచెప్పేలా బీసీ లోకమంతా కంకణ బద్ధులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యా, ఉద్యోగాలలో బీసీలకు రావాల్సిన వాటాను బీసీలకు ఇవ్వాలని, బీసీలకు విధించిన క్రిమిలేయర్ రద్దు చేయాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేపట్టాలని, రిజర్వేషన్లలో మేమెంతో మాకు అంతా వాటా కల్పించాలని, మండల్ కమిషన్ సిఫారసులను వెంటనే అమలు పరచాలని, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు కోటా విధించాలి అనే నినాదంతో హలో బీసీ..చలో అమృత్ సర్ కార్యక్రమంతో 9వ అఖిలభారత జాతీయ ఓబీసీ మహాసభను ఆగస్టు 7న నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీసీ సోదరులంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాడి మల్లయ్య యాదవ్, బచ్చు ఆనందం, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకులు తాళ్ల సంపత్ కుమార్, కాసగాని అశోక్ గౌడ్, పంజల మధు, దాడి రమేష్ యాదవ్, కురిమిళ్ల శ్రీనివాస్, తాళ్లపెల్లి రమేష్, పంజల జ్ఞానేశ్వర్ గౌడ్, కడారి అనిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** చలి వాగు ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు అధికారులు రైతులకు సాగునీరు అందించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని జోగంపల్లి గ్రామ శివారులోని చలి వాగు ప్రాజెక్టు ఆయకట్టు కాలువల ద్వారా పంట పొలాలకు సోమవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు సకాలంలో పంటలు వేసుకునే విధంగా ఇబ్బందులు తలెత్తకుండా సాగునీరు అందించడానికి అధికారులు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కింద 3046 ఎకరాల పంట పొలాలకు సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. కాంట్రాక్టర్ లోపం వలన సిమెంట్ లైనింగ్ పనులు కొంతమేరకే జరిగిందని, ఈ పనులు చెన్నాపూర్ వరకు పూర్తి చేయలేకపోయారని అన్నారు. పనులు చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఉందని, డబ్బులు దుర్వినియోగం జరగకుండా, అతనిపై చర్యలు తీసుకొని, అవసరమైతే కాంట్రాక్టర్‌ను మార్పు చేసిన కాలంలో పనులు పూర్తిచేయాలని అధికారులను కోరారు.పంటలు పూర్తయిన తర్వాత డిసెంబర్ వరకు మిగతా సిమెంట్ లైనింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, చల్లా చక్రపాణి, అబ్బు ప్రకాశ్ రెడ్డి, మండల అధికార ప్రతినిధి చిందం రవి, మారెపల్లి క్రాంతి కుమార్, మోత్కూరి భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

# గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి

### రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లాలో భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా వర్షాలు, వరదలు తగ్గే వరకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, లోతట్టు గ్రామ ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. జిల్లాలో ఎలాంటి విపత్తు ఎదురైనా ఎదుర్కోవడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, గోదావరి పర్యాటక ప్రాంతాల ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ డాక్టర్ శబరీష్ లతో కలిసి మంత్రి సీతక్క ములుగు మండలంలోని రాళ్లవాగు, మెడివాగు, గోవిందరావు పేట మండలంలోని దయ్యాల వాగు, గుండ్ల వాగు, తాడ్వాయి మండలంలోని, నార్లాపూర్ చింతల క్రాస్ జంపన్న వాగు, వాజేడు మండలం లోని పూసుర్ బిడ్జి వరద ప్రవాహాన్ని పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ప్రాజెక్టు నగర్, వెంగ్లాపూర్ గ్రామస్తులను కలసి వరదలతో అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కొట్టుకుపోయిన బ్రిడ్జిల వద్ద రవాణా వ్యవస్థను



కొనసాగించడానికి తాత్కాలిక మరమ్మతులు చేసి పునరుద్ధరించాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు వంకల వద్దకు ప్రజలు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, ఏటూరు నాగారంలోని ఐటీడీఏ కార్యాలయంలో కూడా కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలు ఆపద సమయంలో ఆ నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ములుగు జిల్లాలో గోదావరి నది వరదతో అదే విధంగా జంపన్నవాగు వరద ప్రవాహంతో పరిసర ప్రాంతాలకు సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని, గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని ఉద్దేశంతో జంపన్న వాగు పరిసర ప్రాంతాలలో ప్రత్యేకంగా ఒక అధికార బృందాన్ని ఏర్పాటు చేశామని, జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో రెస్పాన్స్ ఫోర్స్ , ఎన్ డీఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి రెండు గంటలకు జంపన్న వాగు వరద ఉధృతి లెవెల్స్ పర్యవేక్షించడం జరుగుతుందని, ప్రజలు కూడా అధికారులకు సహకరించాలని, అధికార యంత్రాంగం ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, డి ఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్, ఇంజినీరింగ్ అధికారులు,మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన ఘనత సాధించిన గాయని సనశ్రీ

## ఎనిమిది గంటల నిరంతర గానం

## హ్యాట్రిక్ బుక్ ఆఫ్ రికార్డుల నమోదు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ మ్యూజికల్ క్లబ్" వ్యవస్థాపకుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ రంగు రఘుపతి నేత ఆధ్వర్యంలో ఆదివారం నయీంనగర్ లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల ఆడిటోరియంలో ఏకకాలంలోనే మూడు హ్యాట్రిక్ బుక్స్ కోసం నిరంతర గాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జ్యోతి ప్రజ్వలనకు ప్రముఖ సంగీత, సాహిత్య పితామహుడు ప్రొఫెసర్ వి.తిరుపతయ్య -సంగీత విద్వాంసులు, పొట్లపల్లి, శ్రీనివాస రావు రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్, రచయిత, శ్రీ గట్టు మహేష్ బాబు-ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు, సీహెచ్ దేవేందర్ రెడ్డి- వాగ్దేవి కాలేజ్ చైర్మన్, కె. విజయ్ కుమార్-ఏసీపీ సైబర్ క్రైమ్, గుండేటి నరేంద్ర కుమార్-20 వ డివిజన్ కార్పొరేటర్, త్రిపురనేని గోపీచంద్- ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్, బూర విద్యాసాగర్- యాక్టర్, ఆకుల సంపత్ - ధృవ పద్మావతి డిగ్రీ కళాశాల- ప్రిన్సిపాల్, తోట పూర్ణ చందర్ రావు (పీసీఆర్)-చేతుల మీదుగా జ్యోతిని వెలిగిస్తూ, విఘ్నేషుని గానంతో కార్యక్రమాన్ని లైవ్ స్ట్రీమింగ్ రంగ్ మ్యూజిక్ -యూట్యూబ్ ఛానెల్ లో ప్రారంభించారు. గాయని కుమారి సనశ్రీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిరంతరంగా తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ బహు భాషలలో 108 పాటల సాహిత్య లిపి/లిరిక్స్ ని చూడకుండా సంగీత, సాహిత్య సంబంధిత డివోషనల్, సెమీ క్లాసికల్, ఫోక్, డ్యూయెట్ మెలోడీ సినిమా పాటలను చూడకుండా పాడి రికార్డ్ క్రియేట్ చేశారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో శాశ్వతంగా అరుదైన పేరును సింగర్ సన శ్రీ నమోదు చేసుకోవటం జరిగింది. ఈ హ్యాట్రిక్ బుక్ ఆఫ్ రికార్డులకు సంబంధించిన ఇండియాకి చీఫ్ టీవీ అశోక్ కుమార్-(తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్ అబ్జర్వర్ అండ్ జ్యూరీ మెంబర్), సింగరపు శివరామకృష్ణ-(ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్-కోఆర్డినేటర్) చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, మెడల్స్, బ్యాడ్జిలతో సత్కరించారు. అనంతరం సింగర్ సనశ్రీ మాట్లాడుతూ లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్, వరల్డ్ గిన్నిస్ బుక్ రికార్డు సాధించటమే తన జీవిత లక్ష్యమని తెలిపారు. రియల్టర్ చిప్ప ఐలయ్య, మాస్టర్ జీ ప్రిన్సిపాల్ బాసని ప్రోలారం, రంగు శ్రీలత- రంగు రఘుపతి నేత సింగర్ తల్లిదండ్రులు, నల్ల లక్ష్మినారాయణ, వనపర్తి పద్మావతి, ఉపేందర్, రిటైర్డ్ సీఐ రావుల కోలను రామ్మూర్తి, బిటవరం శ్రీమన్నారాయణ, ఎర్ర ప్రసున్న, గుజ్జారి రమేష్ బాబు, మల్లోజు సత్యనారాయణ, చిప్ప వెంకటేశ్వర్లు, బేతి అశోక్, దొడ్డికొమురయ్య సినిమా డైరెక్టర్ సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న 1650 మంది అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించి, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం నెలకు 42వేల గౌరవ వేతనం చెల్లించాలని కోరుతూ వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని అతిథి అధ్యాపకులు సోమవారం హనుమకొండలోని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో గత పది సంవత్సరాలుగా రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు పనిచేస్తున్నప్పటికీ, తమకు పీరియడ్స్ ప్రకారం వేతనాలను చెల్లిస్తూ, రెగ్యులర్ గా కాకుండా మూడు నెలలకు ఒకసారి తమ జీతాలు రావడం జరుగుతుందని వాపోయారు. చాలీచాలని జీతాలతో తమ బ్రతుకులను ఎల్ల తీస్తూ, ఉద్యోగం ఒక్కటే దిక్కు అనే ఉద్దేశంతో పనిచేస్తున్న తమకు ప్రభుత్వం ఆటో రేనివల్ విధానాన్ని అమలుచేసి, ఉద్యోగ భద్రత కల్పించి, తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఇప్పటికిప్పుడు ఉద్యోగం నుంచి తీసివేస్తే తాము రోడ్డున పడతామని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా నెలకు రూ.42,000 వేతనాన్ని చెల్లించి, గెస్ట్ సిస్టం నుంచి తమను ఎంటీఎస్ గా విధానంలోకి మార్చి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. గతంలో వివిధ కారణాలవల్ల డిస్టర్బ్ అయిన అతిథి అధ్యాపకులకు, కొత్తగా ఏర్పడే వేకెన్సీలలో అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అతిథి అధ్యాపకులు దేవేందర్, సునిల్ కుమార్, చిరంజీవి, శివ, హరిప్రసాద్, సతీష్, హరిబాబు, రాధిక, సబిత, ఉర్ఫా, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అంటేనే రైతుల పార్టీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రైతులకు రుణమాఫీ జరిగిన సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి జిల్లా సోషల్ మీడియా మాజీ కోఆర్డినేటర్ చల్లా వాసుదేవ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. సీఎం రేవంత్ రెడ్డి మార్క్ పాలన చూపించే మొదటి ప్రయత్నంలో రుణమాఫీ ఒకటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనకు ఫామ్ హౌస్ పాలనకు తేడా చూపించిందన్నారు. ఏకకాలంలో రుణమాఫీ సాధ్యం కాదని పొంగనాలు కొట్టిన మాజీ ముఖ్యమంత్రి కళ్లు తెరవాలని హితవు పలికారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకేసారి రైతు రుణమాఫీ చేస్తూ ఇచ్చిన హామీని అతి తక్కువ సమయంలో నిలబెట్టుకున్న చరిత్ర రేవంత్ రెడ్డి పాలనని ప్రజలకు గుర్తు చేస్తూ గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం లక్ష రూపాయల రుణమాఫీ ఏ విధంగా జరిగిందో అదే విధంగా నేడు రెండు లక్షల రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేస్తున్న రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే రైతుల ప్రభుత్వమని మరోసారి రుజువు చేసే విధంగా రేవంత్ రెడ్డి పాలన కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలుస్తూ రాబోయే రోజులలో జరిగే స్థానిక సంస్థ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీకి బలమైన మెజార్టీ ఇచ్చే విధంగా చూడాలని ఈ సందర్భంగా ప్రజలను ఆయన కోరారు.

## సైడ్ కాల్వలు లేక రోడ్లపై వర్షపు నీరు



**వరంగల్ వాయిస్, మొగిలిచెర్ల :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15 వ డివిజన్ మొగిలిచెర్ల గ్రామంలో పలు వాడలు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అతాలకుతలమయ్యాయి. పలు కాలనీలలో సైడ్ కాల్వల నిర్మాణం జరగకపోవడంతో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో వరద నీరు రోడ్లపై నిలిచిపోయాయి. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతనిధులు చిత్తశుద్ధితో వ్యవహరించి గ్రామంలోని పలు కాలనీలలో సైడ్ కాల్వలు నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే గ్రామస్తులంతా మూకుమ్మడిగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.

## షూ, వాటర్ బాటిల్స్ పంపిణీ



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** మండలంలోని బొల్లికుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సద్గురు సేవా సమితి-బొల్లికుంట ఆధ్వర్యంలో " చందుపట్ల మాధవి -దీన దయాల్ రెడ్డి సహకారంతో పాఠశాలలో చదువుతున్న 85మంది విద్యార్థులకు షూ, వాటర్ బాటిల్స్ అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచి, తల్లిదండ్రులను, గురువులను పెద్దవారిని గౌరవించాలని, మంచి అలవాట్లు నేర్చుకోవాలని, బాగా చదివి వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సద్గురు సేవాసమితి అధ్యక్షుడు పసునూరి వజ్రయ్య, అడ్డగట్ల లక్ష్మీనారాయణ, మార్గం ఎల్లయ్య, గుండు నాగభూషణం, మానుపాటి పరశురాములు, స్కూల్ మాజీ ఎస్ఎంసీ చైర్మన్ గట్టికోప్పుల కేదారి, ప్రధానోపాధ్యాయుడు పిండి ఆనంద్ బాబు, ఉపాధ్యాయులు శ్రీధర్, రవి, కృష్ణారెడ్డి, శివాజీ ఓరుగల్లు హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ నిర్వాహకుడు మచ్చిక రాజు గౌడ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 510 జీవో అమలు చేయకుంటే అసెంబ్లీని ముట్టడిస్తాం

## రామ రాజేష్ ఖన్నా



**వరంగల్ వాయిస్, ఆసిఫాబాద్ :** జాతీయ ఆరోగ్య మిషన్ లో పనిచేస్తున్న వివిధ రకాల సిబ్బందిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అసిఫాబాద్ లోని మైనార్టీ ఫంక్షన్ హాల్ లో జిల్లా మహాసభ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7నెలలు గడుస్తున్న ప్రభుత్వ, ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు సవరించి పెంచకుండా గత ప్రభుత్వం లాగానే దాట వేస్తుందని, వెంటనే కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రామ రాజేష్ ఖన్నా నాలుగో తరగతి సిబ్బంది కనీస వేతనం రూ.26,000 వేతనం ఇవ్వాలని, జాతీయ ఆరోగ్య మిషన్ పని చేస్తున్న 17514 మందికి శ్రమ దోపిడికి గురవుతూ పేద ప్రజల ఆరోగ్యమే పరమావదిగా భావించి పని చేస్తుంటే వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించకుండా కాలయాపన చేయటాన్ని ఆయన విమర్శించారు. జులై 24 నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీని ముట్టడిస్తామని అన్నారు. ప్రతి రోజు ఒక యూనియన్ వారి సమస్యల పరిష్కారానికై ఇందిరాపార్కు వద్ద ధర్నాలు నిర్వహించి మంత్రులకు, అధికారులకు మెమోరాండాలు ఇవ్వాలని నిర్ణయించటం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ ఆల్ క్యాడర్స్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎల్.సురేష్ నాయక్, జనగాం జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ కొండ్ర లత, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, ఉపాధ్యక్షుడు మధుకర్, నాయకులు చిరంజీవి, వినోద్, స్రవంతి, పైసా శ్రావణ్, ముస్తక్, శ్రీనివాస్, గోపి కృష్ణ, సాయిలత, మ్రిదుల్ పాల్గొన్నారు.

### ఆసిఫాబాద్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక..

కొమురం భీం అసిఫాబాద్ జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ నూతన కమిటీ ఎన్నుకున్నట్లు జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా తెలిపారు. ఎన్ హెచ్ఎం జిల్లా అధ్యక్షుడు బోగే ఉపేందర్(ఏఐటీయూసీ), జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్లుగా గ్యార వినోద్, ఎండీ షకీల్, ఉపాధ్యక్షుడు ఏ.చిరంజీవి, గోపి కృష్ణ, చంద్రకళ, జిల్లా ప్రధాన కార్యదర్శి బుడిపెల్లి మధుకర్, సహాయ కార్యదర్శి ముస్తాక్, బి.శ్రీదేవి, సాయిలత, కోశాధికారి సంగీతలను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

## ప్రధానోపాధ్యాయురాలు స్వాతికి సన్మానం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** సుదీర్ఘకాలం పాటు సేవలందించి పాఠశాల విద్యార్థులకు చక్కని బోధన చేసిన ప్రధానోపాధ్యాయురాలు స్వాతి సేవలు మరువలేనివని మాజీ సర్పంచ్ శీలం లింగన్న గౌడ్ అన్నారు. తొర్రూరు మండలంలోని వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో సోమవారం పదమూడేళ్లుగా ప్రధానోపాధ్యాయురాలిగా సేవలందించిన తిరునగరి స్వాతి బదిలీ వీడ్కోలు సన్మానోత్సవ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తదనంతరం స్వాతిని పూలమాల, జ్ఞాపిక, శాలువా, సన్మాన పత్రంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శిరీష, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మాధవి, మాజీ సర్పంచ్ వెంకన్న, సహోపాధ్యాయురాలు హారిక, గ్రామ ప్రముఖులు, తల్లిదండ్రులు, విద్యాభిమానులు పాల్గొన్నారు.


# ఆగస్ట్‌లో ముగ్గురు హీరోల సందడి

## మూడు ప్రధాన సినిమాల విడుదల





వచ్చే ఆగస్టు 15వ తేదీ వస్తోంది అంటే సినిమా ప్రియులకి మంచి శుభవార్త. ఆరోజు ముగ్గురు కథానాయకులు తమ సినిమాలతో పోటీ పడుతున్నారు. అందులో ఇద్దరు సీనియర్ నటులు కాగా, ఒకరు యువ నటుడు వున్నారు. రామ్ పోతినేని, పూరి జగన్ కాంబినేషన్ లో వస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' ఆగస్టు 15న విడుదలవుతోంది. ఈ సినిమా ఇంతకు ముందు వీరిద్దరి కాంబినేషన్ లో విజయవంతంగా వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' కి సీక్వెల్ గా వస్తోంది. కావ్య థాపర్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నారు. పూరి జగన్, ఛార్మి ఈ సినిమాకి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. పూరి జగన్ ఇంతకు ముందు విజయ్ దేవరకొండతో తీసిన 'లైగర్' బాక్స్ ఆఫీస్ దగ్గర ఒక డిజాస్టర్ గా నిలిచిన సంగతి తెలిసిందే. అందుకనే ఈ సినిమాపై ఎక్కువ ఆశలు పెట్టుకున్నారు. ఇక రెండో సినిమా రవి తేజ, దర్శకుడు హరీష్ శంకర్ ల కాంబినేషన్ లో వస్తున్న 'మిస్టర్ బచ్చన్'. ఇది హిందీ సినిమా 'రైడ్' కి రీమేక్ గా వస్తోంది. రాజ్ కుమార్ గుప్త దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అజయ్ దేవగన్ కథానాయకుడు, ఇలియానా కథానాయికగా నటించింది. ఇన్కమ్ టాక్స్ రైడ్ నేపథ్యంలో వచ్చిన ఈ సినిమాని దర్శకుడు హరీష్ శంకర్ 'మిస్టర్ బచ్చన్' పేరుతో రీమేక్ చేశారు. సౌరబ్ శుక్ల నటించిన పాత్ర తెలుగులో జగపతి బాబు పోషిస్తున్నారని అంటున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయకురాలు. ఈ సినిమా ఆగస్టు 15న విడుదలవుతుందని అధికారికంగా ప్రకటించారు. రవి తేజ ముందు సినిమాలు 'ఈగల్', 'టైగర్ నాగేశ్వర రావు' సినిమాలు బాక్స్ ఆఫీస్ ముందు బోల్తా పడ్డాయి. ఇప్పుడు ఈ 'మిస్టర్ బచ్చన్' బాక్స్ ఆఫీస్ ముందు ఎలా ఉంటుందో చూడాలి. ఇప్పటికే ఈ సినిమా నుండి ఒక పాటని విడుదల చేశారు, అది మంచి ప్రజాదరణ పొందింది. ఇంకో సినిమా తమిళ నటుడు విక్రమ్ నటించిన 'తంగలాన్'. పా. రంజిత్ దీనికి దర్శకుడు, ప్రముఖ నిర్మాణ సంస్థ స్టూడియో గ్రీన్ ఈ సినిమాని పెద్ద బ్జడెట్ పెట్టి నిర్మిస్తోంది. కెఈ జ్ఞానవేల్ రాజా నిర్మాత. ఈ సినిమా కూడా ఆగస్టు 15న విడుదలవుతోంది. ఈ సినిమా అటు తమిళం, తెలుగు భాషలతో పాటుగా మిగతా అన్ని భాషల్లో కూడా విడుదలవుతోంది. విక్రమ్ ఇందులో మూడు వైవిధ్యమైన పాత్రలలో కనిపించి మెప్పిస్తారు అని అంటున్నారు. ఈ సినిమా ఒక పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కనుంది. ఇంతకు ముందు వచ్చిన 'కేజీఎఫ్' సినిమాకి ప్రీక్వల్ గా ఈ సినిమా ఉండొచ్చు అని కూడా అంటున్నారు. మాళవిక మోహనన్ ఇందులో ఇంకో ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. ఇలా మూడు సినిమాలతో ముగ్గురు కథానాయకులు ఈ ఆగస్టు 15వ తేదీన వస్తున్నారు. ఆ తేదీ నుండి వరసగా సెలవులు కలిసి రావటం ఈ సినిమాలకి బాగా కలసి వస్తుందని కూడా అంటున్నారు. ఈ మూడు సినిమాలతో పాటు చిన్న సినిమా '35: చిన్న కథ కాదు' అనే సినిమా కూడా ఆగస్టు 15న విడుదలవుతోంది. ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి ఈ సినిమాకి సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు.



# ఆ విషయాలు

## పట్టించుకోవాల్సిన పని లేదు.

ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన జాన్వీకపూర్ కోలుకుని ఇంటికి చేరుకుని.. రెండ్రోజుల్లోనే మళ్లీ యాక్టివ్ అయ్యాక వరుస ప్రమోషన్లో పాల్గొంటున్నారు. తన తదుపరి చిత్రం 'ఉలఝ్' చిత్రం విడుదల నేపథ్యంలో ఆమె వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఆదివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో సోషల్‌మీడియా ట్రోల్స్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఆన్‌లైన్ వేదికగా స్టార్‌కిడ్స్ ఎదుర్కొంటున్న విమర్శలపై ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'సోషల్ మీడియాలో వచ్చే విమర్శలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు. అసలు వాటిని పట్టించుకోవడం కూడా వృథా. ఎందుకంటే, సోషల్‌మీడియా కల్చర్ అది. నువ్వు పబ్లిక్ ఫిగర్ అయినా, కాకపోయినా ఇలాంటివి నిరంతరం జరుగుతూనే ఉంటాయి. కాబట్టి ఆ కామెంట్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదు. ఒక విషయంలో ఈరోజు పొగిడినవాళ్లే అదే విషయంపై రేపు తిడతారు. ముక్కూ, మొఖం తెలియని వాళ్లు ఏదో అన్నారని ఇంట్లో కూర్చొని ఏడవడం దేనికి?. మనకు మనమే ప్రాధాన్యం ఇచ్చుకోవాలి' అని అన్నారు. అనంతరం అనంత్ అంబానీ సతీమణి రాధిక మర్చంట్ కోసం పార్టీ ఇవ్వడంపైజాన్వీ మాట్లాడారు. 'రాధిక నాకు మంచి ఫ్రెండ్. తను మాతో చాలా సరదాగా ఉంటుంది. మమ్మల్ని జాగ్రత్తగా చూసుకుంటుంది. అందుకే, వివాహానికి ముందు ఆమె కోసం ప్రత్యేకంగా ఒక పార్టీ ఏర్పాటుచేయాలని ఫ్రెండ్స్ అందరం అనుకున్నాం. అందులో భాగంగా గ్రాండ్ పార్టీ ఇచ్చాం. తను చాలా సంతోషించింది' అని చెప్పారు. 'ఉలఝ్' విషయానికి వస్తే.. జాతీయ అవార్డు గ్రహీత సుధాంశు సరియా తెరకెక్కించారు. జంగ్లీ పిక్చర్స్ సంస్థ నిర్మించింది. జాన్వీ ఇందులో ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారిణిగా కనిపించనుంది. ఈ పొలిటికల్ థ్రిల్లర్‌లో గుల్షన్ దేవయ్య, రాజేశ్ థైలాంగ్ ముఖ్య పాత్రలు పోషించారు.




# ఆసక్తి రేకెత్తిస్తున్న రాజమౌళి..

# మోడ్రన్ మాస్టర్స్

## అతనో లెజెండ్ అంటూ చిత్ర ప్రముఖుల కామెంట్స్



టాలీవుడ్ అగ్ర దర్శకుడు రాజమౌళిపై ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ 'మోడ్రన్ మాస్టర్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపొందించింది. ఇందులో ఆయన సినీ ప్రయాణాన్ని చూపించనున్నారు. ఆగస్టు 2 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఇది స్ట్రీమింగ్ కానుంది. తాజాగా దీనికి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేయగా అది అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అందులో టాలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్ సినీ ప్రముఖులు రాజమౌళిపై వారి అభిప్రాయాలను పంచుకున్నారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్, ప్రభాస్‌లతోపాటు హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్, బాలీవుడ్ దర్శకనిర్మాత కరణ్ జోహర్‌లు కూడా వారి అభిప్రాయాన్ని తెలియజేశారు. ఇలాంటి దర్శకుడిని నేను ఇప్పటివరకు చూడలేదు. సినిమాలంటే ఆయనకు పిచ్చి ప్రేమ అని ప్రభాస్ తన అబిప్రయాం పంచుకున్నారు. ఆయన సినిమాల్లో నన్ను నేను చూసుకొని ఎంతో ఆశ్చర్యపోతానని నటుడు రామ్‌చరణ్ ప్రకటించారు. ఇప్పటివరకు ఎవరూ చూపించని కథలను ప్రపంచానికి చెప్పడం కోసమే రాజమౌళి జన్మించారని మరో నటుడు ఎన్టీఆర్ అన్నారు. ఈ ఇద్దరు కూడ ఆరాజమౌళి ట్రిపుల్ ఆర్‌లో మంచి నటనను చాటారు. రాజమౌళికి సాధ్యం కానిది ఏదీ లేదు. ఎవరితోనైనా పని చేయగలరు. ఆయనంటే నాకెంతో గౌరవం అంటూ ఆంగ్ల చిత్రాల దర్శకుడు జేమ్స్ కామెరూన్ వ్యాఖ్యానించారు. రాజమౌళితో పని చేసిన వారందరూ ఆయన్ని పని రాక్షసుడని పిలుస్తుంటారని ఆయన భార్య, ప్రముఖ క్యాస్టూమ్స్ డిజైనర్ రమా రాజమౌళి అభిప్రాయపడ్డారు. దర్శకుడు రాజమౌళి ఓ లెజెండ్ అని హిందీ దర్శక సమర్పకుడు కరణ్ జోహార్ అన్నారు.

# కౌన్సిల్ సమావేశం నిర్వహించండి

## గ్రీవెన్స్‌లో కార్పొరేటర్ల వినతి

## ప్రజా సమస్యలపై పట్టింపులేదా అంటూ నిలదీత

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎనిమిది మాసాలుగా వరంగల్ మహానగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించకపోవడంతో అభివృద్ధి పనులు కుంటుపడి ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, ఈ విషయంలో బల్దియా కమిషనర్ చొరువ చూపి వెంటనే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని పలువరు కార్పొరేటర్లు సోమవారం గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్లు మరుపల్ల రవి, పల్లం పద్మా-రవి, గుగులోత్ దివ్య-రాజు, భోగి సువర్ణ-సురేష్ లు బల్దియా కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన గ్రీవెన్స్ లో పాల్గొని ఈ మేరకు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కు వినతిపత్రం అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వెంటనే సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలంటూ 26 ఫిబ్రవరిన 34మంది కార్పొరేటర్లతో మేయర్ గుండు సుధారాణికి వినతి పత్రం ఇచ్చినప్పటికీ స్పందన కరువైందని ఆరోపించారు. వినతి పత్రం ఇచ్చి ఆరు మాసాలు కావస్తున్నా ఇంతవరకు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ విషయంలో కమిషనర్ జోక్యం చేసుకొని సాధారణ సభ సమావేశం ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు. గత మూడు రోజులుగా కురుస్తున్నా వర్షాలతో గ్రేటర్ పరిధిలోని అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమైనా పట్టించుకునే వారే కరువయ్యారని ఆరోపించారు. పలు డివిజన్లలో అంటువ్యాధులు ప్రబలి జనం మంచాలకే పరిమితమవుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. అయినప్పటికీ అధికారులు ముందస్తుగా ప్రణాళికలు తయారు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్నపుడు కనీసం స్థానిక కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వడం లేదంటూ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు.



### నా పరిధిలో లేదు..

### అశ్విని తానాజీ వాకడే, కమిషనర్

సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయడం నా పరిధిలో లేదు. మేయర్ కు మాత్రమే ఆ అధికారం ఉన్నందున వారిని కలవండి. డివిజన్లలో సమస్యలు ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే పరిశీలిస్తాం. ఇప్పటికే వివిధ డివిజన్లనుంచి సమస్యలు అందుతున్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు.

### గ్రీవెన్స్‌కు 91 ఫిర్యాదులు..

బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన గ్రీవెన్స్ లో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా 32 వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ-రవి సాకరాశికుంట నుంచి హెచ్ పి పెట్రోల్ బంక్ వరకు ఆగిపోయిన రోడ్డు పనులను డివైడర్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని, హనుమాన్ ఆటో జంక్షన్ నుంచి వాణి విద్యానికేతన్ స్కూల్ వరకు రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని కమిషనర్ వినతి పత్రం అందజేశారు. 22 ఇంజనీరింగ్ విభాగానికి చెందినవి, ఏడు హెల్త్ సానిటేషన్, ఏడు ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ), 55 టౌన్ ప్లానింగ్ విభానికి చెందినవి మొత్తం 91 ఫిర్యాదులు అందినట్లు అధికారులు ప్రకటించారు. కాగా త్వరతగతిన గ్రీవెన్స్ ఫిర్యాదులను పరిష్కరించాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి అదనపు కమిషనర్ కృష్ణా రెడ్డి, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సిటీ ప్లానర్ వెంకన్న, బయలజిస్ట్ మాధవ రెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, హెచ్ఓ రమేష్, టీపీఆర్ఓ కోలా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# పొంగిపొర్లుతున్న త్రివేణి సంగమం

**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో గోదావరి నది పొంగిపొర్లుతోంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతోపాటు, ఎగువ ప్రాంతంనుంచి వస్తున్న వరదతో త్రివేణి సంగమంలో 12 మీటర్ల ఎత్తు నుంచి గోదావరి ప్రవహిస్తోంది. దీంతో గోదావరి నది వద్ద స్నానాలు చేయడం, ఇతర పూజా కార్యక్రమాలను నిషేధించారు. ప్రాణహిత, గోదావరి నదులనుంచి భారీగా వస్తున్న వరద నీరు మేడిగడ్డ బ్యారేజ్ లోకి చేరడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. వరద ఉధృతిని పర్యవేక్షిస్తున్న స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ, స్థానిక ఎస్సై గోదావరి నది ఒడ్డు మీద ఉన్న దుకాణాలను తీసివేయాలని హెచ్చరించారు. స్థానికులు అప్రమత్తంగా ఉండాలంటూ సూచించారు.




# అడవిలో చిక్కుకున్న పోలీసులు

## హెలికాప్టర్ ద్వారా వాజేడు మండలానికి తరలింపు

**వరంగల్ వాయిస్, ములుగు క్రైం :** వారం రోజుల క్రితం ములుగు జిల్లా వాజేడు మండలం సరిహద్దు ప్రాంతమైన ఛత్తీస్ ఘడ్ అడవుల్లోకి కూంబింగ్ నిమిత్తం వెళ్లిన ములుగు జిల్లా పోలీసు బలగాలు భారీ వర్షాల నేపథ్యంలో అడవిలోనే చిక్కిపోయారు. ఇటీవల జరిగిన ఎలిమిడి ఎన్‌కౌంటర్‌లో పాల్గొని తిరుగు ప్రయాణమైన ములుగు జిల్లా పోలీసులకు గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు అడ్డంకిగా మారాయి. అడివిలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించడంతో వాజేడు మండల పరిధిలోని పెనుగోలు గుట్టల్లోనే వారు నిలిచిపోయినట్లు సమాచారం. ఈ క్రమంలో వారు తీవ్ర అనారోగ్యం పాలై నడవలేని స్థితిలో ఉన్నారని తెలుసుకున్న జిల్లా పోలీస్ యంత్రాంగం సోమవారం ప్రత్యేక హెలికాప్టర్ సహాయంతో వాజేడు మండలం మండపాక గ్రామానికి తరలించి వైద్య చికిత్స నిర్వహించినట్లు తెలిసింది. అంతేకాకుండా సదురు పోలీస్ బలగాలను మెరుగైన వైద్యం కోసం ములుగు ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది.

# ఆగస్టు నుంచి మెరుగైన వైద్య సేవలు

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

## ఆదనవు కలెక్టర్ సంధ్యారాణితో కలసి సమీక్ష

**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నర్సంపేట జిల్లా ఆసుపత్రి, వైద్య కళాశాల నిర్మాణం పూర్తయినందున ఆగస్ట్ 1 నుంచి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణితో కలసి సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. నర్సంపేటలో 250 పడకల జిల్లా ఆసుపత్రి, వైద్య కళాశాల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. నర్సంపేట జిల్లా ఆసుపత్రికి అవసరమైన మొత్తం ఎక్విప్ మెంట్, ఫర్నీచర్ త్వరితంగా సమకూర్చుకోవాలన్నారు. సమీపంలో వెళుతున్న మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా ఆసుపత్రికు మంచినీటి సరఫరా కల్పించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ప్రొఫెసర్ రాంకుమార్ రెడ్డి సారథ్యంలో ఏడు కమిటీలను నియమించి పనులను సకాలంలో పూర్తి చేసేలా పర్యవేక్షించాలన్నారు. నర్సంపేట ప్రాంత చుట్టుపక్కల గ్రామాల్లో నూతన ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు ప్రారంభంపై ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది ద్వారా ప్రచారం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి,



ఆర్డీవో కృష్ణవేణి, కళాశాల ప్రిన్సిపల్ కిషన్, టీజీఎంఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్, బ్యాంక్ మేనేజర్ రాజు, నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి ప్రిన్సిపల్ గోపాల్, మిషన్ భగీరథ ఈఈ వెంకట్రామణ రెడ్డి, మెటర్నిటీ హాస్పిటల్ పీఓ పద్మశ్రీ అసోసియేట్ ప్రొఫెసర్లు రమేష్, ఉషారాణి, కలెక్టరేట్ పర్యవేక్షకులు విశ్వ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### గ్రీవెన్స్ దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలి..

గ్రీవెన్స్ దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. కలెక్టరేట్ కన్ఫరెన్స్ హాల్ లో సోమవారం జిల్లా కలెక్టర్ తోపాటు జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్డీఓ కౌసల్య దేవి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. .

# లెనిన్‌నగర్‌లో ఆహార ప్యాకెట్ పంపిణీ

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరంలోని 42వ డివిజన్ లెనిన్ నగర్ లో సోమవారం ముంపు ప్రాంత వాసులకు ఆహార ప్యాకెట్లు అందజేశారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ముంపుకు



గురైన ప్రాంతాలలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశానుసారం ఆహార ప్యాకెట్స్ పంపిణీ చేసినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 42వ డివిజన్ అధ్యక్షుడు ఎలుగు సాంబేశం, ముఖ్య నాయకులు కంచ మల్లయ్య, జినుక రమేష్, ప్రవీణ్ మైనార్టీ నాయకుడు బషీర్, మున్సిపల్ జవాన్ ఎండీ కలీం తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో సోమవారం గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన చల్లూరి రమేష్ (50) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఎస్సార్ యూనివర్సిటీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న రమేష్ రోజు మాదిరిగానే విధులు ముగించుకొని బైక్ పై ఇంటికి వెళ్తున్న క్రమంలో హైవేపై ప్రమాదం జరిగి అక్కడిక్కడే మృతి చెందారు. అయితే రమేష్ మృతి అనుమానాస్పదంగా ఉందంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇతనికి భార్య వసంత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు 108లో మృతదేహాన్ని హుజూరాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి పోస్ట్ మార్టం నిమిత్తం తరలించారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com